క్లుప్తంగా

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానం

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జె.సంధ్య మాధురి శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సంస్కృతం పోస్ట్ ఖాళీగా ఉందని తెలిపారు. సంస్కృతంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో 50 శాతం పైన మార్కులు సాధించిన వారు అర్హులు. అభ్యర్థులు ఈ నెల 15వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులు కళాశాల కార్యాలయంలో అందజేయాలన్నారు. 16వ తేదీ సాయంత్రం 3 గంటల నుంచి ఒరిజినల్ సర్టిఫికెట్స్ తీసుకొని వస్తే డెమో ఇటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

వైభవంగా సప్త శనివార సేవ



విజయవాడ కల్చరల్: శృంగేరీ శారదపీఠం ఆధ్వర్యంలో దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో సప్త శనివార సేవలో భాగంగా జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామి, విధుశేఖర భారతి ఆదేశంతో రామకోటిలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధర్మాధికారి శిష్టా హనుమత్ ప్రసాద్ మాట్లాడుతూ మూర్తీభవించిన ధర్మానికి ప్రతిరూపం శ్రీ రామచంద్రుడన్నారు. కోట్లాది భారతీయలకు పూజనీయుడన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

దాసాంజనేయునికి ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వయంభూ మాచవరం శ్రీదాసాంజనేయస్వామివారి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు, అర్చనలు జరిగాయి. ఆలయ అర్చకుడు స్వామివారికి ప్రీతికరమైన సింధూరం, ఆకు పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. రెండో శనివారం సెలవుదినం కావటంతో పెద్ద సంఖ్యలో భక్తులు, విద్యార్థులు ఆలయానికి చేరుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. వాహన చోదకులు వాహన పూజలు చేయించుకున్నారు.

జర్నలిస్టులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సమయపాలన లేని వృత్తి జర్నలిజం అని, నిద్రాహారాలేకుండా ప్రజాసేవలో నిమగ్నమైన జర్నలిస్టులు ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో జాగ్రత్తలు తీసుకోవడం లేదని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, విజయవాడ ప్రెస్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం జరిగింది. దీన్ని ఎమ్మెల్యే ఉమా ప్రారంభించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కంచల జయరాజ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఐజేయూ జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్, ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యుడు ఎస్.కె బాబు, ఏపీయూడబ్ల్యూజే అర్బన్ యూనిట్ అధ్యక్షుడు చావా రవి, కార్యదర్శి దారం వెంకటేశ్వరరావు, సామ్నా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ రమణారెడ్డి, ప్రెస్ క్లబ్ కార్యదర్శి దాసరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో రాజమండ్రికి చెందిన శ్రీలలిత కళాప్రియ నృత్య నికేతన్‌కు చెందిన పలువురు కళాకారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట కళావేదికపై నాట్యాచారిణి కె.నవ్య పర్యవేక్షణలో 20 మంది చిన్నారులు నాట్య ప్రతిభను ప్రదర్శించారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం కళావేదిక వద్దకు చేరుకున్న భక్తులు చిన్నారుల నృత్య ప్రదర్శనను వీక్షించి వారిని అభినందించారు. అనంతరం శిష్యబృందానికి అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలను అందజేశారు.

కాపు రిజర్వేషన్‌కు మద్దతివ్వండి

భవానీపురం(విజయవాడపశ్చిమ): కాపులను బీసీలుగా గుర్తించాలని కోరుతూ చిత్తూరు నుంచి అమరావతి వరకు పాదయాత్ర చేస్తూ వస్తున్న ఏపీ బీసీ రిజర్వేషన్ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సానా ప్రసాద్ శనివారం కాపు ఉద్యమ నేత ఆకుల శ్రీనివాస్ కుమార్‌ను భవానీపురంలోని ఆయన నివాసంలో కలిశారు. కాపు రిజర్వేషన్‌కు మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు. అనంతరం ఆకుల శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలవారు అత్యధికంగా పేద వర్గాలుగానే ఉన్నారని, వారని వెంటనే బీసీలుగా గుర్తించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అల్లం పూర్ణ, రెడ్డిపల్లి సురేష్, పలువురు కాపు నాయకులు పాల్గొన్నారు.

రోడ్డుపై ఇలా.. వదిలేస్తే ఎలా?



సాంబమూర్తి రోడ్డులో వాటర్ వర్క్స్ పనులకోసం తవ్విన గొయ్యి



జీవీఆర్‌నగర్ మెయిన్ రోడ్డులో యూజీడీ పనులు పూర్తయినా తొలగించని మట్టిగుట్ట

సహనాన్ని పరీక్షిస్తున్న పైపులైన్ పనులు

- పనులు పూర్తయినా రోడ్డుపైనే ఇసుక, మట్టిగుట్టలు
- రాకపోకలకు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలో జరుగుతున్న యూజీడీ, వాటర్ వర్క్స్ పనులు స్థానికుల సహనాన్ని పరీక్షిస్తున్నాయి.

విషయం ఇదీ..

శ్రీనగర్‌కాలనీ, ముత్యాలంపాడు, దుర్గాపురం, బావాజీపేట, సత్యనారాయణపురం, టీచర్స్ కాలనీ తదితర ప్రాంతాలలో పాతకాలం నాటి వాటర్ పైపులైన్‌ల స్థానంలో నూతన పైపులైన్‌లు ఏర్పాటు చేస్తున్నారు. యూజీడీ మ్యాన్ హోల్స్‌ను రోడ్డుకు సమాంతరంగా చేస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉంది.

సమస్య ఇదీ..

అయితే పైపులైన్, యూజీడీ పనుల కోసం తవ్విన గోతులను మాత్రం సరి చేయటం లేదు. దీంతో రాకపోకలకు వాహన చోదకులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే సాంబమూర్తి రోడ్డులో గత నెల రోజులుగా పనులు జరుగుతూనే ఉన్నాయి. తవ్విన గోతులలో తూతూ మంత్రంగా మట్టి, డస్ట్ పోసి వదలివేస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు మట్టి, డస్ట్ కుంగిపోయి ప్రమాదకరంగా మారుతున్నాయి.

పనులు పూర్తయినా

30వ డివిజన్ జీవీఆర్‌నగర్‌లో యూజీడీ మ్యాన్‌హోల్‌లను రోడ్డుకు సమాంతరంగా చేస్తున్నారు. ఇందులో భాగంగా రోడ్డును తవ్వి మ్యాన్‌హోల్‌ను రోడ్డుకు సమానంగా తయారు చేశారు. అయితే, పనులు పూర్తయి పది రోజులు దాటినా మ్యాన్‌హోల్ ఎత్తు పెంచటానికి తవ్విన మట్టిని మాత్రం రోడ్డుపై నుంచి తొలగించ లేదు. దీంతో రోడ్డు మధ్యలో ఉన్న మట్టి వల్ల రాకపోకలకు వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి పనులు పూర్తయ్యిన వెంటనే రోడ్డుపై మట్టి, వ్యర్థాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

నత్తనడకన పనులు

వాటర్ పైపులైన్ పనులు నత్తనడకన జరుగుతున్నాయి. పైపులైన్ పనులలో భాగంగా తవ్విన గోతులలో వర్షపునీరు నిలిచిపోవటంతో పనులలో మరింత జాప్యం ఏర్పడుతోంది. పనులు రోజుల తరబడి జరుగుతుండటంతో వాహన చోదకులు నానాయాతన పడుతున్నారు. తవ్విన మట్టి వర్షాలు కురిసినప్పుడు బురదగా మారి ఇబ్బందికంగా తయారవుతుతోంది. అధికారులు స్పందించి పనులను వేగవంతం చేయాలని, తవ్విన గోతులను వెంటనే సరిచేయాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలి



కుమార సూర్యనారాయణను సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: బాల బాలికలలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని నాట్యాచార్యుడు ఉమామహేశ్వర పాత్రుడు అన్నారు. శ్రీ వాగ్దేవీ కూచిపూడి నృత్యాలయ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయా గ్రంథాలయంలో శనివారం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన చిన్నారుల నృత్య ప్రదర్శనలు, ప్రతిభకనపరచిన విద్యార్థినులు వెంకటేశ్వర, శివనంది, స్వర్ణనంది పురస్కారాలు, సంగీత విద్వాంసుడు కుమార సూర్యనారాయణకు కళారత్న పురస్కారం అందుకున్న సందర్భంగా ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉమామహేశ్వర పాత్రుడు మాట్లాడుతూ సంప్రదాయ నృత్య కళలను పరిరక్షించుకోవాలని సూచించారు. సంగీత విద్వాంసుడు కుమార సూర్యనారాయణను గురించి మాట్లాడుతూ ఆయనకు పురస్కారాలు, అవార్డులు కొత్తకాదన్నారు. శాస్త్రీయ సంగీతానికి జీవితం అంకితం చేశారన్నారు. వందలాది నృత్య కార్యక్రమాలకు గాత్ర సహకారం అందించినట్లు తెలిపారు. నాట్యాచార్యుడు ఘంటసాల పవన్‌కుమార్, మాగలూరి త్రినాధాచారి, కమ్మర్షియల్ శాఖ అధికారి వీజీవీవీడీఎస్ కుమార్, పీ నరసింహమూర్తి, ఆర్‌వీ నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు. చిన్నారులు సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు. ప్రతిభ చూపిన కళాకారులుకు శ్రీ వెంకటేశ్వర, శివనంది పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. వివధ ప్రాంతాల నుంచి వచ్చిన చిన్నారులు పాల్గొన్నారు. సంగీత విద్వాంసుడు కుమార సూర్యనారాయణను వాగ్దేవీ నృత్యాలయ నిర్వాహకులు సప్పా శివకుమార్, ధనలక్ష్మి ఘనంగా సత్కరించారు.

ప్రమాదాల నివారణకు స్టాప్ వాష్ రిఫ్రెష్ అండ్ గో



లబ్బీపేట(విజయవాడతూర్పు): వేకువ జామున నిద్రమత్తులో జరుగుతున్న ప్రమాదాలను నివారించడానికి పోలీసులు 'స్టాప్ వాష్.. రిఫ్రెష్ అండ్ గో' నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా అర్ధరాత్రి దాటిన తర్వాత 2 గంటల నుంచి 5 గంటల మధ్య కాలంలో ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని జాతీయ రహదారులపై వాహనాలను ఆపి, వారు నీటితో ముఖం వాష్ చేసుకుని తిరిగి ప్రయాణించేలా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. అందులో బాగంగా శుక్ర, శనివారాల్లో తిరువూరు, జి.కొండూరు జాతీయ రహదారులపై భవానీపురం, గొల్లపూడి హైవేల వద్ద ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. నిద్రలేకుండా ఎక్కువ దూరం ప్రయాణించే వాహన డ్రైవర్లు తెల్లవారు జామున నిద్రలోకి జారుకుంటున్నారని అందుకే ఈ కార్యక్రమం నిర్వహించాలని సీపీ రాజశేఖరబాబు ఆదేశాలు జారీ చేశారు.

కొండ దిగువన ఆధ్యాత్మిక వాతావరణం

పోలీసు, రెవెన్యూ, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రి కొండ దిగువన ఆధ్యాత్మిక వాతావరణం, ఆలయ సంస్కృతి ప్రతిబింబించేలా చర్యలు తీసుకుందామని దుర్గగుడి ఈవో శీనానాయక్ పేర్కొన్నారు. ఇంద్రకీలాద్రిపై మహా మండపం నాల్గో అంతస్తులోని ఈవో ఛాంబర్‌లో శనివారం పోలీసు, దేవస్థాన ఇంజినీరింగ్, వైదిక సిబ్బందితో సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ వైపు నుంచి విచ్చేసే భక్తులు కొండపైకి చేరుకునేందుకు ఇబ్బందులకు గురవుతున్నారని ఈవో పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. భక్తులు కొండపైకి చేరుకునేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచన చేయాలన్నారు. ముఖ్యంగా టోల్‌గేట్ మార్పు చేయడం గురించి చర్చించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద పార్కింగ్ పాయింట్, కనకదుర్గనగర్, దుర్గాఘాట్‌లో సమాచార కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఏడీసీపీ జి.రామకృష్ణ, వెస్ట్ ఎసీపీ దుర్గారావు, దుర్గగుడి ఏసీ రంగారావు, ఈఈ కోటేశ్వరరావు, డీఈలు, ఏఈవోలు రమేష్‌బాబు, తిరుమలేశ్వరరావు, వెంకటరెడ్డి, గంగాధర్, వన్‌టౌన్ సీఐ గురుప్రకాష్ పాల్గొన్నారు.

దుర్గగుడి అధికారులకు అదనపు విధులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడిలో భక్తులకు మౌలిక వసతులు కల్పించడానికి అదనపు విధులు కేటాయించారు. ఈ మేరకు శనివారం ఈవో శీనానాయక్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సహాయ కమిషనర్ రంగారావుతో పాటు ఊఈవోలు వెంకటరెడ్డి, తిరుమలేశ్వరరావు, చంద్రశేఖర్, రమేష్‌బాబు, శ్రీనివాస్, కె. గంగాధర్‌కు మహా మండపంలో సదుపాయాల బాధ్యత అప్పగించారు. ఆలయ ప్రాంగణంలో తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణ, పారిశుద్ధ్య నిర్వహణ, భక్తులు వేచి ఉండే ప్రాంతంలో సదుపాయాలు, రవాణా సౌకర్యాలపై భక్తుల్లో 37.7 శాతం మంది అసంతృప్తిగా ఉండటంతో ఈ మేరకు అదనపు విధులను కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. అధికారుల పురోగతి సాధించాలని లేని పక్షంలో క్రమశిక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు.

ఆర్థోపెడిక్ సర్జరీలపై వర్క్‌షాపు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఎముక విరిగినప్పుడు దానికి శస్త్ర చికిత్స ఎలా చేయాలి, ఒకవేళ ఏదైనా ఇంప్లాంట్ వేయాల్సి వస్తే ఎలా అమర్చాలి అనే అంశాలపై శనివారం ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాలలో వర్క్‌షాపు జరిగింది. ఆర్థోపెడిక్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సును తొలుత కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆలపాటి ఏడుకొండలరావు లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వర్క్‌షాపు నిర్వహించారు. ఈ వర్క్‌షాపులు ఆర్థోపెడిక్ విభాగానికి చెందిన వైద్యులతో పాటు, 25 మంది పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యార్థులు పాల్గొన్నారు. ప్రాక్సిమల్ హ్యూమరస్ ఫ్రాక్చర్లకు సంబంధించిన తాజా చికిత్స పద్ధతులపై వినూత్న సమాచారాన్ని తెలియజేశారు. పోస్టుగాడ్యుయేషన్ విద్యార్థులకు శాస్త్రీయమైన అవగాహనకు ఇది దోహదపడుతుందని అధ్యాపకులు తెలిపారు.


సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ సమరం

పటమట(విజయవాడతూర్పు): విద్యార్థులు సేవా భావాన్ని అలవర్చుకోవాలని డాక్టర్ జి. సమరం అన్నారు. శనివారం పటమట బెంజిసర్కిల్ సమీపంలోని ఆదిత్య కళాశాలలో రోటరాక్ట్ ఇన్‌స్టలేషన్ సెర్మనీ కార్యక్రమం జరిగింది. రోట్రాక్ట్ క్లబ్ ఆఫ్ అటోమా- రోట్రాక్ట్ క్లబ్ ఆఫ్ అరుణ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రోట్రాక్ట్ ద్వారా సేవాదృక్పథంతో పాటు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవచ్చని తెలిపారు. రోటరీ క్లబ్ విజయవాడ ప్రెసిడెంట్ బాలగోపాల్ మాట్లాడుతూ క్లబ్ సహకారంతో కార్యక్రమాలు చేయడానికి ముందుంటామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కొసిరెడ్డి వీర్రాజు మాట్లాడుతూ ఈ ఏడాది రక్తదానం, ప్లాస్టిక్ పై అవగాహన డ్రగ్స్ అవేర్నెస్ ప్రోగ్రామ్స్ వంటి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులు సేవా భావం ప్రదర్శించడం అభినందనీయమని తెలిపారు. అనంతరం నూతన ఆఫీస్ బేరర్స్‌గా కె.అభిషేక్, కె.లలిత అధ్యక్షులుగా ఎన్నికవ్వగా కార్యదర్శులుగా ఎం. రేణుక, సీహెచ్ అబ్బాస్ నియమితులయ్యారు. కార్యక్రమంలో రోటరాక్ట్ సెక్రటరీ రామ్ గోపాల్, సీడీఆర్‌సీ రాము, ఆర్‌ఏసీ చైర్మన్ సీతారామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచాన్ని మార్చే శక్తి యువతది



మాట్లాడుతున్న కేయూ వీసీ ఆచార్య కె.రాంజీ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): యువతకు ఆలోచనలతో ప్రపంచాన్ని మార్చే శక్తి ఉందని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.రాంజీ అన్నారు. కేబీఎన్ కళాశాల గ్రాడ్యుయేషన్ డే, ప్లేస్‌మెంట్ డే కార్యక్రమాలను శనివారం ఆ కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. రాంజీ మాట్లాడుతూ చదువుని మించిన శక్తి ప్రపంచంలో లేదన్నారు. ప్రయత్నించడం మానుకోవడమే నిజమైన అపజయమని, పరాజయాలను సాకుగా చూపించి నిస్తేజంగా మారటం తగదని విద్యార్థులకు సూచించారు. యువత సాంకేతికత, కమ్యూనికేషన్, సృజనాత్మకతలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి మాట్లాడుతూ డిగ్రీ స్థాయిలో 17 కోర్సుల్లో 579 పట్టాలు, ప్లేస్‌మెంట్‌పరంగా 389 మంది డిగ్రీ విద్యార్థులకు, 124 మంది పీజీ విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్నట్లు చెప్పారు. కళాశాల కార్యదర్శి టి.శ్రీనివాసు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్కూల్స్ బ్యాగ్స్ కుట్టే షాపులో పనిచేసే యువకుడు అదృశ్యమైన ఘటన భవానీపురంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌కు చెందిన షేక్ మహబూబ్ సుభాని ఆర్టీసీ వర్క్‌షాపు రోడ్లో స్కూల్ బ్యాగ్స్ రిపేర్ షాపులో పనిచేస్తున్నాడు. ఈ నెల 8వ తేదీ ఉదయం షాపునకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి స్కూటీ వేసుకుని వెళ్లాడు. ఇంటికి తిరిగి రాలేదు. యువకుడు తల్లి రెహమాన్ బేగం అతను పనిచేసే షాపు వద్దకు వెళ్లి ఆరాతీసింది. సుభానీ షాపునకు రాలేదని యజమాని తెలిపారు. దీనిపై అతని తల్లి భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

నేత్ర పర్వంగా సంప్రదాయ నృత్య ప్రదర్శన

విజయవాడ కల్చరల్: శ్రీఅరుణోదయ కళాసమితి 7వ వార్షికోత్సవం సందర్భంగా జీవీఆర్ సంగీత కళాశాలలో శనివారం నిర్వహించిన సంప్రదాయ నృత్యాలు నేత్ర పర్వంగా సాగాయి. నాట్యాచారిణి మంజూష ఆధ్వర్యంలో చిన్నారులు కూచిపూడి, భరతనాట్యం సంప్రదాయంలో పలు అంశాలను ప్రదర్శించారు. కూచిపూడి సంప్రదాయంలో తాండవ నృత్య కరి, బ్రహ్మాంజలి, దశావతారశబ్దం, అష్టలక్ష్మీస్తోత్రం, తరంగం అంశాలను, భరతనాట్య సంప్రదాయంలో అలరింపు, జతిస్వరం అంశాలను ప్రదర్శించారు. అరుణోదయ కళాసమితి కార్యదర్శి మాధురి, సంస్థ వ్యవస్థాపకుడు విజయమోహనరావు నృత్య కార్యక్రమాలను పర్యవేక్షించారు. సంగీత కళాశాల ప్రిన్సిపాల్ కందుల లక్ష్మీనరసమ్మ, విద్యావేత్త వలివేటి శివరామకృష్ణ, ఆశాజ్యోతి వికలాంగుల సేవా సంస్థ నిర్వాహకురాలు ఎమ్.మాధవీలత పాల్గొన్నారు. అరుణోదయ విద్యార్థినులు నాట్యాచారిణి పక్కి మంజూషను సత్కరించారు.

నిరుపేదలకు అన్నదానం



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఆకలిలో.. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉందని కళ్ళే లలితా ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు కళ్ళే నాగేశ్వరరావు అన్నారు. ఆ ట్రస్ట్ ఆధ్వర్యంలో సింగ్‌నగర్ రైతుబజార్ వద్ద శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ట్రస్ట్ సభ్యులతో కలిసి కళ్ళే లలిత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ నిరుపేదలకు అన్నదానం చేయడం, వారికి విద్యా, వస్త్ర దానాలు చేయడం అంటే కళ్ళే లలితకు ఎంతో ఇష్టమని.. ఆమె కన్న కలలను నిజం చేసేందుకు తమ ట్రస్ట్ సభ్యులంతా నిరతరం శ్రమిస్తున్నారన్నారు. గత 45 నెలల నుంచి నిరుపేదలను ఆదుకునేందుకు అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్లు కళ్ళే సీతామహాలక్ష్మి, జయదుర్గ, మేఘవాణి, ముప్పూరి హరీష్, ఎమ్.జశ్విన్, జి.ధ్రువన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరించాలి

వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



మల్లాది విష్ణుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న వైఎస్సార్ సీపీ క్లస్టర్-2 నాయకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ క్లస్టర్ సభ్యులు సమన్వయంతో పనిచేసి కూటమి వైఫల్యాలు, మోసాలు, బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పిలుపునిచ్చారు. స్థానిక జనహిత సదనంలో శనివారం సాయంత్రం నూతనంగా నియమితులైన వైఎస్సార్ సీపీ క్లస్టర్- 2 అధ్యక్షుడు బోగాధి మురళి, సభ్యులు మల్లాది విష్ణును మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చే కస్తోందన్నారు. రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. ఈ తరుణంలో క్లస్టర్ సభ్యులు ప్రజలకు అండగా ఉండాలని సూచించారు.

16 నుంచి క్లస్టర్ సమావేశాలు

ఈనెల 16వ తేదీ నుంచి సెంట్రల్ నియోజకవర్గంలో క్లస్టర్ మీటింగ్‌లు నిర్వహించనున్నట్లు మల్లాది విష్ణు తెలిపారు. 16న సాయంత్రం మారుతీనగర్‌లో క్లస్టర్- 1 కమిటీ సమావేశం. 19న సాయంత్రం నాడార్స్ ఫంక్షన్ హాల్‌లో క్లస్టర్- 2, 20న పాయకాపురంలో క్లస్టర్- 3 కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశానికి క్లస్టర్ సభ్యులు, వైఎస్సార్ సీపీ నేతలు హాజరు కావాలన్నారు. ప్రజలకు అండగా ఉంటామని భరోసా కల్పించాలని సూచించారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అడ్డుకున్న స్థానికులు

- గృహాలకు విద్యుత్ సరఫరా నిలిపివేసిన అధికారులు
- విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా



విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన ధర్నా

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రజల అనుమతి లేకుండా నిరుపేద, పేద దళిత వర్గాల ప్రజలు అధికంగా ఉండే 31వ డివిజన్ అంబేడ్కర్ కాలనీలో ఇళ్లకు అడ్డగోలుగా స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారు. స్మార్ట్ మీటర్ల బిగింపును పెద్దలు, స్థానికులు వ్యతిరేకించారు. దీంతో వారు ఇళ్లకు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. విద్యుత్ భారాలు, స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ అంబేడ్కర్ కాలనీలో స్థానిక ప్రజలతో కలిసి సీపీఎం నాయకులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీపీఎం సెంట్రల్ సిటీ కమిటీ సభ్యులు ఎం.బాబూరావు మాట్లాడుతూ అంబేడ్కర్ కాలనీలో నిరుపేద దళిత కుటుంబాలకు బలవంతంగా స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని తెలిపారు. విద్యుత్తు అధికారులు ఇంటింటికీ తిరుగుతూ మీటర్ రిపేరు వచ్చిందని, పాత మీటర్ తొలగించి స్మార్ట్ మీటర్ బిగిస్తున్నామని చెబుతున్నారన్నారు. ఇళ్లకు స్మార్ట్ మీటర్ల వద్దని అడ్డగించిన ప్రజల ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం దుర్మార్గమన్నారు. దీనిపై ఉన్నత అధికారులకు ఫోన్ చేసి ప్రశ్నించగా ఇళ్లకు విద్యుత్ వైర్లు కలిపామని చెప్పారన్నారు. ప్రజలు ఇళ్లల్లో లేని సమయం చూసి దొంగచాటుగా స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. అనంతరం స్థానికులతో కలిసి ముత్యాలంపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన ధర్నా నిర్వహించారు. తమ ఇళ్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే సహించబోమని తేల్చి చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం 31వ డివిజన్ కార్యదర్శి జి.నాగరాజు, నాయకులు జి.మోతి, సీహెచ్. కృష్ణారావు, ఎస్.ప్రసాద్, మణిమ్మ, విమల, కళావతి పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): కూటమి ప్రభుత్వం ట్రూ అప్ చార్జీలు, సర్దుబాటు చార్జీలు, స్మార్ట్ మీటర్ల పేరుతో విద్యుత్ చార్జీలు మూడు నుంచి నాలుగు రెట్లు పెంచి ప్రజలపై మోయలేని భారాలు మోపిందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్ మండిపడ్డారు. పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం సీపీఎం ఆధ్వర్యంలో సత్యనారాయణపురంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు భూపతి రమణారావు, కె.దుర్గారావు, టి.ప్రవీణ్, సెంట్రల్ సిటీ కమిటీ సభ్యులు ఎం.బాబురావు, ఎస్.కె. మీరాసాహెబ్, వినియోగదారులు జి.మోతి, కిరణ్ కుమార్, హెచ్ కరుణాకర్, సీహెచ్ కృష్ణారావు పాల్గొన్నారు.

ఈలప్రోలు రైల్వే ఎల్‌సీ గేటు తాత్కాలికంగా మూసివేత

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రాయనపాడు-కొండపల్లి మధ్యలోని రైల్వే లెవల్ క్రాసింగ్ గేటు నెంబర్ 140ని రెండు రోజుల పాటు తాత్కలికంగా మూసివేయనున్నట్లు విజయవాడ డివిజన్ సీనియర్ సెక్షన్ ఇంజినీర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్‌సీ గేటు వద్ద బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టనుండటంతో ఈ నెల 14వ తేదీ ఉదయం 8 నుంచి 15వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ఎల్‌సీ గేటును మూసివేయనున్నారు. ఈ గేటు మీదుగా రాకపోకలు సాగించే వాహనచోదకులు ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించుకోవాల్సిందిగా కోరారు.